గుంతలతో చింతలెన్నో..

- అధ్వానంగా బోధన్–రుద్రూర్ రోడ్డు
- భారీ గుంతలు, కంకర తేలి ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేయాలని కోరుతున్న స్థానిక ప్రజలు


బోధన్ -రుద్రూర్ మధ్య దెబ్బతిన్న రహదారి

బోధన్ రూరల్(బోధన్) : బోధన్ –రుద్రూర్ రోడ్డు మార్గం పలు చోట్ల అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా బోధన్ పట్టణ శివారులోని గోదాంలు ఉన్న ప్రాంతం నుంచి రుద్రూర్ మార్గంలోని గుండ్ల వాగు బ్రిడ్జి వరకు రోడ్డు ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. అనేక చోట్ల భారీ గుంతలు ఏర్పడి, కంకర తేలి వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ రోడ్డుపై కనీసం ప్యాచ్ వర్క్ కూడా చేపట్టడం లేదు.

బోధన్ – బాన్సువాడకు ప్రధాన మార్గం

బోధన్ – రుద్రూర్ రోడ్డు బోధన్ మండలంలోని మినార్‌పల్లి, సంగం, భవానీపేట్ గ్రామాలకు బాన్సువాడ నియోజకవర్గంలోని రుద్రూర్, వర్ని, కోటగిరి, బాన్సువాడలకు ప్రధాన మార్గంగా ఉంది. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. బోధన్ మండలంలోని మినార్ పల్లి, సంగం, భవానీపేట్ ప్రజలతో పాటు బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. బోధన్–బాన్సువాడకు ప్రధాన అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు గుంతలు, కంకర తేలి దెబ్బ తినడంతో రెండు నియోజకవర్గ ప్రజలు నిత్యం ప్రయాణ ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.

త్వరలో జాతీయ రహదారి..

బోధన్ – రుద్రూర్ రోడ్డు మార్గంలో త్వరలో నేషనల్ హైవే పనులు మొదలవ్వనున్నాయి. రుద్రూర్ నుంచి బోధన్ పట్టణ కేంద్రం వరకు రెండు వరుసల హైవే అభివృద్ధి కోసం ఇప్పటికే నేషనల్ హైవే అధికారులకు ఈ రోడ్డును అప్పగించడం జరిగిందని ఆర్అండ్ బీ అధికారులు అంటున్నారు. నేషనల్ హైవే అభివృద్ధి కోసం ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఇప్పటికే ఫైనల్ అలైన్ మెంట్‌ను సైతం ఆమోదించి టెండర్ ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. నేషనల్ హైవే పనులు చేపట్టేవరకు ఆర్ అండ్ బీ అధికారులు, నేషనల్ హైవే అధికారులు సమన్వయంతో రోడ్డు పరిస్థితిపై దృష్టి సారించి దెబ్బతిన్న రోడ్డును బాగు చేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.


ఘన్‌పూర్ చౌరస్తా వద్ద అధ్వానంగా రోడ్డు

మరమ్మతులు చేపట్టాలి



బోధన్ – రుద్రూర్ రోడ్డు మార్గంలో గోదాంలు ఉన్న ప్రాంతం నుంచి గుండ్ల వాగు వరకు అనేక చోట్ల గుంతలు, కంకరతేలి ప్రమాదకరంగా తయారైంది. దీంతో నిత్యం ప్రయాణ ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఈ మార్గంలో హైవే రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు అధికారులు చెపుతున్నారు. హైవే రోడ్డు పనులు చేపాట్టేవరకు రోడ్డుకు మరమ్మత్తులు చేసి ప్రయాణ ఇబ్బదులు, ప్రమాదాలను నివారించాలని కోరుతున్నాం.

– ఎస్ సాయిలు, సంగం, బోధన్ మండలం

క్లుప్తంగా

‘లిల్లిపుట్’లో ఆర్ట్ డే



పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాలలో శనివారం ఆర్ట్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ ఆలోచనలకు అనుగుణంగా చిత్రాలను చిత్రీకరించారు. పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపల్ దాసు చిన్నారుల చిత్రాలను వీక్షించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల అందజేత



రుద్రూర్ : పోతంగల్ మండలం హంగర్గా ఫారం గ్రామానికి ప్రభుత్వం సరాఫరా చేసిన రంజాన్ కానుకలను లబ్దిదారులకు శనివారం సర్పంచ్ ఏజాజ్ ఖాన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి నిర్మల, స్థానిక నాయకులు మండవ దిలీప్ కుమార్, జైనుద్దీన్, వలియొద్దీన్, రఫీ, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

మెండోరా మండల పరిధిలో..

బాల్కొండ : మెండోరా మండల పరిధిలో పలు ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వం అందించిన రంజాన్ దుస్తులను శనివారం మండల కేంద్రంలో ఎంపీపీ సుకన్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తలారి గంగాధర్, వైస్ ఎంపీపీ సరస్వతి, డీసీసీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు బాబా, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి సందర్శన



బోధన్‌టౌన్(బోధన్) : బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని వైద్య విధాన పరిషత్ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వేల్ఫేర్ పోగ్రాం ఆఫీసర్ సుజాత సందర్శించారు. ఆస్పత్రిలోని మెటర్నిటీ, లేబర్, పిల్లల వార్డుతో పాటు ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఇతర వార్డులను పరిశీలించారు. ఈ వార్డులు వసతుల కల్పనను గురించి వైద్యులు, వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శివ శంకర్, వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్వీ నేతకు పరామర్శ



కమ్మర్‌పల్లి : బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత శ్రీకుమార్‌ను మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం పరామర్శించారు. శ్రీకుమార్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో మంత్రి కమ్మర్‌పల్లిలోని ఆయన ఇంటికి వెళ్లి ఓదార్చారు. సర్పంచ్‌లు స్వామి, శంకర్, నాయకులు చిన్నారెడ్డి, దేవేందర్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

నేడు ఆర్మూర్‌లో ఇఫ్తార్



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్‌లోని మార్కెట్ యార్డులో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందు స్థలాన్ని శనివారం తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహన్, బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. కౌన్సిలర్‌లు ఫయాజ్, ఇంతియాజ్, అబ్దుల్ రహ్మాన్, అతిక్, నాయకులు పండిత్ ప్రేమ్, పూజ నరేందర్, సుంకరి రవి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నవీపేట : మండలంలోని యంచలో మెడికోవర్ హాస్పిటల్(నిజామాబాద్) ఆధ్వర్యంలో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గుండె జబ్బులతో బాధపడుతున్న 173 మందికి ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన రోగులకు సూచనలు చేశారు. సర్పంచ్ కొట్టాల లహరి, గుండె వైద్య నిపుణులు మోహన్, కోటేశ్వర్ రావ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చందూర్ ఎంపీపీ రాజీనామా

త్వరలో బీజేపీలో చేరిక


బీజేపీలోకి ఆహ్వానిస్తున్న మల్యాద్రి రెడ్డి

రుద్రూర్ : చందూర్ మండల ఎంపీపీ, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లావణ్య రాంరెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. మూడు రోజుల క్రితమే పార్టీ అధిష్టానానికి సమాచారం అందించి రాజీనామ లేఖ పంపినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మల్యాద్రి రెడ్డి చందూర్‌లో ఎంపీపీని మర్యాదపూర్వకంగా కలిసి బీజేపీలోకి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈనెల 19న రాష్ట్ర రాజధానిలో బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్ సమక్షంలో పార్టీలో చేరుతారని వారు వెల్లడించారు.

రాష్ట్రంలోనే చిన్న మండలం చందూర్

మూడు ఎంపీటీసీ స్థానాలతో రాష్ట్రంలోనే చందూర్ అతిచిన్న మండలంగా ఏర్పడింది. కాంగ్రెస్ నుండి ఇద్దరు అభ్యర్థులు విజయం సాధించగా, బీఆర్ఎస్ నుంచి ఒకరు గెలు పొందారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక సమయంలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే హాజరుకావడంతో పలు మార్లు ఎన్నిక వాయిదా పడింది. సీనియర్ కాంగ్రెస్ నేతలు ఎన్నికల అధికారిని కూడా కలిసి వాయిదా వేయకుండా ఎంపీపీ ఎన్నిక చేయాల్సిందిగా విన్నవించారు. ఎట్టకేలకు ఎంపీపీగా లావణ్య రాంరెడ్డి, వైస్ ఎంపీపీగా దశాగౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈ తరుణంలో చందూర్ ఎంపీపీ బీజేపీలో చేరితే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు ఒకోక్క ఎంపీటీసీ ఉన్నట్టవుతుంది.

మహనీయుల జయంతి సభను సక్సెస్ చేయాలి


శ్యాంరావ్‌ను పరామర్శిస్తున్న మంద కృష్ణ మాదిగ

బోధన్‌టౌన్(బోధన్) : ఏప్రిల్ మాసం మహనీయులు జన్మించిన మాసం అని ఈ మాసంలో మహనీయులైన జ్యోతిబా పూలే, జగ్జీవన్ రాం, అంబేడ్కర్ జయంతి ఉత్సవ సభను సక్సెస్ చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం బోధన్ మండలంలోని బెల్లాల్‌కు చెందిన వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ తండ్రి శ్యాంరావ్ సూర్యవంశీని పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని అంబేడ్కర్, పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో ఉన్న బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బోధన్‌లో ఈనెల 28వ తేదీన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీల ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాల సభను 10 వేల మందితో నిర్వహించాలన్నారు. మందకృష్ణ మాదిగను బీజేపీ నేత, న్యాయవాది శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఎంఎస్పీ జిల్లా కో– ఆర్డినేటర్ డల్లా సురేష్, ఎమ్మార్పీఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి పానుగంటి భరత్, నాయకులు లక్ష్మిగారి భూమన్న, పట్టణ కన్వీనర్ తడెం అబ్బయ్య, నాయకులు గందమాల చంద్రయ్య, సాగర్ తదితరులు ఉన్నారు.

సంఘాల మధ్య స్థల వివాదం


వీరబ్రహ్మేందస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని రాజారాంనగర్ కాలనీలో స్థలం విషయంలో విశ్వబ్రాహ్మణ సంఘం, బుడగ జంగం కులస్తుల మధ్య వివాదం నెలకొంది. 40ఏళ్ల క్రితం అప్పటి మంత్రి అర్గుల్ రాజారాం ఇచ్చిన 400 గజాల స్థలంలో విశ్వబ్రాహ్మణ సంఘం కులస్తులు ప్రహరీ నిర్మించారు. ప్రస్తుతం ఆ స్థలం మాదేనని బుడగ జంగం కులస్తులు మూణ్నెళ్ల క్రితం కల్లుదుకాణం పెట్టారు. దీంతో విశ్వబ్రాహ్మణసంఘం సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన విశ్వబ్రాహ్మణ సంఘం కులస్తులు శనివారం పోతులూరి వీరబ్రహ్మం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఇరుసంఘాల సభ్యులు వాగ్వాదానికి దిగారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు సంఘాల వాళ్లను సముదాయించి అక్కడి నుంచి పంపించేశారు. తహసీల్దార్ వేణుగౌడ్, కమిషనర్ ప్రసాద్ చౌహాన్ ఫీల్డ్ విజిట్ చేసి ఇరువురితో మాట్లాడారు. స్థల సమస్యను తాము పరిష్కరిస్తామని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి నాగేశ్వర్‌రావు

భీమ్‌గల్ : మండలంలోని పల్లికొండ, రహత్‌నగర్, తాళ్లపల్లి, దేవక్కపేట్ గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను మండల స్పెషల్ ఆఫీసర్, డీటీడబ్ల్యూవో నాగేశ్వర్ రావ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మన ఊరు మన బడి పనులను నాణ్యతతో చేపట్టాలని, స్కూల్ టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజేశ్వర్ ఉన్నారు.

నేడు భీమ్‌గల్‌లో మంత్రి పర్యటన

మంత్రి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నేడు భీమ్‌గల్ మండలంలో పర్యటిస్తారు. భీమ్‌గల్ మున్సిపాలిటీ కేంద్రంలో డా. మధుశేఖర్ ఆధ్వర్యంలో చేయుత స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటు చేస్తున్న ఉచిత మెగా సర్జికల్ హెల్త్ క్యాంప్ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బడా భీమ్‌గల్ క్లస్టర్ పరిధిలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారు.

దివ్యాంగులకు ఇంటర్వ్యూలు

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణ పరిధిలోని దివ్యాంగులకు ఆర్థిక పునరావాస పథకం కింద లబ్ధిదారులు ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ తెలిపారు. ఈనెల 17న ఉదయం మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో మూడు సెట్ల జెరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు.

రెండు వీల్‌చైర్‌లు అందజేత



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి కొండూర్ అనిల్‌కుమార్ ఎన్ఆర్ఐ రెండు వీల్‌చైర్‌లు అందజేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు తమవంతుగా సహకారంగా రెండు వీల్‌చైర్ అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరిటెండెంట్ నాగరాజ్ అనిల్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అమృతరాం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో భార్గవి సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి అంగన్వాడీ కేంద్రంలో శనివారం వార్శికోత్సవాన్ని నిర్వహించారు. వేడుకలకు సీడీపీవో భార్గవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. ఏసీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్లు శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు సంగీత, గోదావరి, రజిని తదితరులున్నారు.

రథం షెడ్డు ప్రారంభం



బాల్కొండ : మండలంలోని వన్నెల్(బి) గ్రామంలోని వెంకటేశ్వర ఆలయ రథం భద్రపర్చేందకు నిర్మించిన షెడ్డును శనివారం సర్పంచ్ భూదేవి చేతుల మీదుగా ప్రారంభించారు. ఉపసర్పంచ్ కిషన్, పీఏసీఎస్ చైర్మన్ సురాజ్‌రెడ్డి, నాయకులు లింగాగౌడ్, దాసరి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీరడి రవి కుమార్‌కు దళిత రత్న అవార్డు



బోధన్ : బోధన్‌కు చెందిన ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ ,మాల మహానాడు డివిజన్ కమిటీల ఉపాధ్యక్షుడు నీరడి రవికుమార్‌కు దళిత రత్న అవార్డుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించి అంబేడ్కర్ జయంతి ఉత్సవంలో కమిటీ ప్రతినిధులు దళిత రత్న అవార్డును అందించారు.

చెక్కుల పంపిణీ



బోధన్ : పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో శనివారం బోధన్ అర్బన్, రూరల్, నవీపేట, రెంజల్ మండలాలకు చెందిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా చెక్కులు అందించారు. 159 కళ్యాణ లక్ష్మి, 74 షాదీముబారక్ అందజేశారు. ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ షకీల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీంద్ర యాదవ్, ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ పాల్గొన్నారు

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం


ఎంఈవోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కుర్నాపల్లి ఎంపీటీసీ రాంరెడ్డి

ఎడపల్లి(బోధన్) : ఎడపల్లి మండలం సర్వసభ్య సమావేశం శనివారం మండల పరిషత్ అధ్యక్షుడు కే శ్రీనివాస అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని 80 శాతం మంది సర్పంచులు గైర్హాజ రయ్యారు. అధికారులు కూడా తమ సిబ్బందిని పంపారు. ఎంపీటీసీలు మాత్రం కోరంకు సరిపడా హాజరయ్యారు. ముగ్గురికి ఒక సింగిల్ విండో చైర్మన్ మాత్రమే హాజరయ్యారు. దీంతో సభమొక్కుబడిగా సాగింది. ఈ సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు తీర్మానాలు చేశారు. పీహెచ్‌సీలో పనిచేసే హెచ్‌వో రాములు విధులకు సక్రమంగా రావట్లేదన్నారు. ఆయన ట్రాన్స్‌ఫర్ చేయాలని తీర్మానించారు. కుర్నాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ లో వీవీలకు జీతాలిచ్చేందుకు విద్యార్థుల నుంచి రూ. 100 వసూలు చేస్తున్నారని ఎంపీటీసీ వెంకయ్య గారి రాంరెడ్డి అన్నారు. విచారణ చేస్తానని ఎంఈవో పేర్కొన్నారు. అంగన్‌వాడీల పనితీరు సరి గ్గా లేదని ఎంపీపీ శ్రీనివాస్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్ వినోదం తనిఖీలు చేస్తామని హామీ ఇచ్చారు. కుర్నాపల్లి జీపీ పరిధిలోని వడ్డెర కాలనీకి మిషన్ భగీరథ నీళ్లు రావట్లేదని ఎంపీటీసీ రామ్ రెడ్డి మిషన్ భగీరథ అధికారులపై మండిపడ్డారు. వడ్లపల్లిలో అంగన్‌వాడీకి నీళ్లు లేకపోతే టీచర్ ఆయా కలిసి గుంత తవ్వుకున్నారని జెడ్పీటీసీ రజిత యాదవ్ మండిపడ్డారు. ఈ సమావేశంలో ఎంపీడీవో గోపాలకృష్ణ, తహసీల్దార్ ఆకుల శేఖర్, ఎంపీవో సుభాష్ చంద్రబోస్, వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరాములు, ఎంఈఓ రామారావు, సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

మాక్లూర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరిపతి సంఘం ఆవరణలో శనివారం జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. అనంతరం ముల్లంగి(బి), కల్లెడి గ్రామాల్లో కేంద్రాలు ప్రారంభించి రైతులనుద్దేశించి మాట్లాడారు. ఏ– గ్రేడ్ ధాన్యం క్వింటాలు ధర 2060, బీ– గ్రేడ్ ధర 2040 ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్‌పర్సన్ గోపు లక్ష్మి, వైస్ చైర్మన్ రమేశ్, మాజీ చైర్మన్ రమణరావు, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో క్రాంతి, డైరెక్టర్లు కాశీనాథ్ రావు, బూరోళ్ల అశోక్, జిట్టా గంగాధర్, సుక్కి సుధాకర్, శేఖర్‌రావు, కోకా హైమద్, మండల వ్యవసాయ అధికారి పద్మ, రైతులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లికి బైపాస్ రోడ్డు నిర్మించాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కమ్మర్‌పల్లి : కమ్మర్‌పల్లిలో 63వ నంబర్ జాతీయ రహదారి విస్తరణతో జీవనోపాధి కోల్పోతున్నామని నష్టపోకుండా చూడాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి బాధితులు విన్నవించారు. శనివారం కమ్మర్‌పల్లికి వచ్చిన మంత్రిని బాధితులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. రహదారిని ఇరు వైపులా 150 ఫీట్లకు విస్తరించడం వల్ల గృహ సముదాయాలు తొలగి ప్రస్తుతం ఉన్న వ్యాపారాలు దెబ్బతిని రోడ్డున పడే అవకాశముందని వివరించారు. గ్రామం బయటి నుంచి(బైపాస్ రోడ్డు) మళ్లించేలా చూడాలని కోరారు. మంత్రి స్పందిస్తూ ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉంటామన్నారు. సర్పంచ్ స్వామి, చింత ప్రవీణ్‌కుమార్, గణపతి రాం, దేవేందర్, శ్రీను, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలోకి జూనియర్ జీపీ కార్యదర్శులు


మోస్రా ఎంపీవోకు సమ్మె నోటీస్ అందజేస్తున్న జీపీ కార్యదర్శులు

రుద్రూర్: ప్రొబెషన్ ముగిసినప్పటికీ రెగ్యులర్ చేయకపోవడతో ప్రభుత్వంపై నిరసనగా జూనియర్ జీపీ కార్యదర్శులు సమ్మె చేయాలని టీపీఎస్ఎఫ్ (తెలంగాణ పంచాయత్ సెక్రటరీ ఫెడరేషన్) నిర్ణయించింది. ఈ మేరకు మోస్రా మండల పంచాయతీ అధికారికి శనివారం డిమాండ్లతో కూడిన సమ్మె నోటీస్ అందచేశారు. డిమాండ్లు అంగీకరించకపోతే ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు పేర్కొన్నారు. జీపీ కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, కృష్ణయాదవ్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన


మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆర్మూర్‌టౌన్ : షాపింగ్‌మాల్స్, ఆస్పత్రుల్లో ముందు జాగ్రత్తగా ఫైర్‌సేఫ్టీ పరికరాలను అమర్చుకోవడం ప్రధానమని అగ్నిమాపక అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ డిపో ఆవరణలో, సినిమా టాకిస్‌లో, షాపింగ్‌మాల్స్‌లో, అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాలు ప్రతి ఏడాది ఏప్రిల్ 14నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అగ్నిమాపక సిబ్బంది ప్రకాష్, రాజారాం, ప్రసన్న, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి పోస్టాఫీసుల్లో ప్రత్యేక కౌంటర్లు

బోధన్‌టౌన్(బోధన్): కేంద్రం మహిళల కోసం ప్రవేశ పెట్టిన పథకం మహిళా సమ్మాన్, సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం కోసం ఈ నెల 17 నుండి 21 వరకు పోస్టాఫీసుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని పోస్టాఫీసు బోధన్ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణు తెలిపారు. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా మహిళలు ప్రతి ఒక్కరూ ఈ పథకంలో చేరవచ్చన్నారు. రూ. 1,000 నుండి రూ 2 లక్షల వరకు పొదుపు చేయవచ్చన్నారు. ఈ పథకంలో పొదుపు చేసిన మొత్తానికి రూ. 7.5 శాతం వడ్డీతో కలిపి రెండు సంవత్సరాల తర్వాత అందజేయ బడుతుందన్నారు. బ్యాంకులో పొదుపు చేస్తే 2.5% మాత్రమే వడ్డీ వస్తుందన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



బోధన్ : పట్టణంలోని రాకాసీపేట్ ప్రాంతంలోని మునిగుట్ట పై కొలువైన అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్ శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. వేడుకల్లో ఆర్డీవో రాజేశ్వర్, అయ్యప్ప సేవాట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు శివన్నారాయణ, చక్రవర్తి, కోశాధికారి శ్రీనివాస్ గౌడ్,విజయ్ కుమార్ గౌడ్ ఉన్నారు.